నేటినుంచి ఎప్‌సెట్ ఇంజనీరింగ్ పరీక్షలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో 2025-26 విద్యాసంవత్సరంలో ప్రవేశాల కోసం నిర్వహించే ఎప్‌సెట్ రాతపరీక్షలు ఆన్‌లైన్‌లో గతనెల 29న ప్రారంభమయ్యాయి. గతనెల 30 వరకు ఎప్‌సెట్ అగ్రికల్చర్, ఫార్మసీ విభాగం పరీక్షలను నిర్వహించారు. ఈ పరీక్షలకు 86,762 మంది అభ్యర్థులు దరఖాస్తు చేస్తే 81,198 మంది హాజరయ్యారు. శుక్రవారం నుంచి ఎప్‌సెట్ ఇంజినీరింగ్ విభాగం పరీక్షలు ప్రారంభమవుతాయి. ఆదివారం వరకు ఈ పరీక్షలు జరుగుతాయి. మూడు రోజులపాటు ఆరు విడతల్లో పరీక్షలను నిర్వహిస్తారు. ఎప్‌సెట్ ఇంజనీరింగ్ విభాగానికి 2,20,117 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు.

నేడు దోస్త్ నోటిఫికేషన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాల కోసం 2025-26 విద్యాసంవత్సరానికి సంబంధించి డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ (దోస్త్) నోటిఫికేషన్ శుక్రవారం విడుదల కానుంది. దోస్త్ రిజిస్ట్రేషన్ల ప్రక్రియతోపాటు షెడ్యూల్‌ను ప్రకటిస్తారు. గతనెల 22న ఇంటర్మీడియెట్ ఫలితాలు విడుదలైన విషయం తెలిసిందే. ఇంటర్ ప్రథమ సంవత్సరం జనరల్ విభాగంలో 2,93,852 మంది, ఒకేషనల్ విభాగంలో 28,339 మంది ఉత్తీర్ణత పొందారు. ఇంటర్ ద్వితీయ సంవత్సరం జనరల్ విభాగం రెగ్యులర్‌లో 2,85,435 మంది, ఒకేషనల్ జనరల్ విభాగం రెగ్యులర్‌లో 28,713 మంది విద్యార్థులు పాసయ్యారు.

ఎవ్రెన్‌కు రూ.840 కోట్ల నిధులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బ్రూక్‌ఫీల్డ్,యాక్సిస్ ఎనర్జీ ఉమ్మడి భాగస్వామ్య వేదిక అయిన ఎవ్రెన్‌కు 100 మిలియన్ డాలర్లు (దాదాపు రూ.840 కోట్లు) నిధులు అందించడానికి అల్టెర్రా ముందుకు వచ్చినట్లు తెలిపింది. గ్లోబల్ క్లైమెంట్ ఇన్వెస్ట్‌మెంట్ వెహికల్ అయిన ఆల్టెర్రా పొందిన ఈ నిధులను భారతదేశ పునరుత్పాదక ఇంధన మౌలిక సదుపాయాలను ముందుకు తీసుకెళ్లడానికి దోహదం చేయనున్నాయని యాక్సిస్ ఎనర్జీ సిఇఒ మురళి సూరపనేని తెలిపారు.

జూన్ 3 నుంచి టెన్త్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ

- ఫీజు చెల్లింపునకు తుదిగడువు 16
- షెడ్యూల్ విడుదల

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు వచ్చేనెల మూడో తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. అదేనెల 13 వరకు జరుగుతాయి. ఈ మేరకు ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకులు ఎ కృష్ణారావు గురువారం షెడ్యూల్‌ను విడుదల చేశారు. ఈ పరీక్షలు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహిస్తామని తెలిపారు. రీకౌంటింగ్, రీవెరిఫికేషన్ ఫలితాల కోసం ఎదురుచూడకుండా అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు ఫీజు చెల్లించాలని కోరారు. ఫీజు చెల్లింపునకు తుది గడువు ఈనెల 16 వరకు ఉందని పేర్కొన్నారు. ఆలస్య రుసుం రూ.50తో పరీక్ష నిర్వహించే రెండు రోజుల ముందు వరకు చెల్లించే అవకాశముందని తెలిపారు. మూడు కంటే తక్కువ సబ్జెక్టులుంటే రూ.110, మూడు కంటే ఎక్కువ సబ్జెక్టులుంటే రూ.125 ఫీజు చెల్లించాలని కోరారు.

టెట్‌కు 1.83 లక్షల దరఖాస్తులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టిజిటెట్)కు రాష్ట్రవ్యాప్తంగా 1,83,653 దరఖాస్తులొచ్చాయి. టెట్ దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ గడువు బుధవారంతో ముగిసిన విషయం తెలిసిందే. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ సంచాలకులు, టెట్ చైర్‌పర్సన్ ఈవి నరసింహారెడ్డి గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. పేపర్-1కు 63,261 మంది, పేపర్-2కు 1,20,392 మంది కలిపి మొత్తం 1,83,653 మంది దరఖాస్తు చేశారని తెలిపారు. దరఖాస్తుల సవరణకు శనివారం వరకు గడువుందని పేర్కొన్నారు. జూన్ 15 నుంచి 30 వరకు ఆన్‌లైన్‌లో టెట్ రాతపరీక్షలు జరుగుతాయని వివరించారు. ఇతర వివరాల కోసం https://schooledu.telangana.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

సమ్మె వద్దు... చర్చలకు సిద్ధం

- మీతో చర్చలకు ప్రభుత్వం సిద్ధం
- ఆర్‌టిసి కార్మికులకు సిఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి
- కెసిఆర్ మాటల నమ్మి మోసపోకండి
- క్లిష్ట సమయంలో కార్మికులు, ప్రజలు సహకరించండి
- రవీంద్రభారతి ఘనంగా మేడే వేడుకలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మేడే వేడుకలో మాట్లాడుతున్న సిఎం రేవంత్

"సమ్మె ఆలోచన విరమించండి. ఆర్‌టిసి ఇప్పుడిప్పుడే లాభాల బాటలో పయనిస్తోంది. ఇది మీ సంస్థ. దీన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మీపైనే ఉంది. గత పదేండ్లలో ఆర్థిక విధ్వంసం జరిగింది. పంతాలు, పట్టింపులకు పోకండి. ఏవైనా సమస్యలుంటే సంబంధిత మంత్రితో చర్చించండి. వచ్చే ఆదాయమంతా మీ చేతిలో పెడతాం. ఎలా ఖర్చు చేద్దామో మీరే సూచించండి. ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న రాష్ట్రం సమ్మె వల్ల తీవ్రంగా నష్ట పోనుంది. సమ్మె నిర్ణయాన్ని వెనక్కి తీసుకోండి" అని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆర్‌టిసి కార్మికులకు విజ్ఞప్తి చేశారు. తెలంగాణ కార్మిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిర్వహించిన మేడే ఉత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ గత సర్కార్ నిర్వాకం వల్ల రాష్ట్రం సంక్షోభంలో కూరుకు పోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. బడ్జెట్ పద్మనాభం లాగా ఆచి తూచి ఖర్చు చేస్తున్నా ప్రతి నెలా అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. "ప్రభుత్వానికి ప్రతినెలా రూ.18 వేల కోట్ల ఆదాయం వస్తోంది. గత ప్రభుత్వం చేసిన అప్పులపై కిస్తీలకు రూ.6.5 వేల కోట్లు పోతోంది. ఉద్యోగుల జీతభత్యాలకు రూ.6 వేల కోట్లు ఖర్చవుతోంది. ప్రతి నెలా రూ.22 కోట్లు వేల కోట్లు వస్తే తప్ప ప్రభుత్వ కనీస అవసరాలు తీరవు. మాజీ సీఎం కేసీఆర్ రూ.8.15 లక్షల కోట్ల అప్పు చేసి పదవి దిగి వెళ్లిపోయారు. అప్పడు చేసిన అప్పులన్నీ ఎక్కడికి పోయాయో ఆనవాళ్లు తెలియడం లేదు. కేసీఆర్ చేసిన అప్పులకు వడ్డీలు చెల్లించేందుకు 15 నెలల్లో రూ.1.58 లక్షల కోట్లు అప్పు చేయాల్సి వచ్చింది. ఆర్థికంగా రాష్ట్రం క్లిష్ట పరిస్థితుల్లో ఉంది. కొత్త డిమాండ్లు చేసే ముందు ఆలోచించండి. ఏమైనా సమస్యలుంటే కూర్చొని పరిష్కరించుకుందాం" అని సీఎం ఆర్‌టిసి కార్మికులకు విజ్ఞప్తి చేశారు. మిగులు రాష్ట్రంగా ఉన్న తెలంగాణ పదేండ్ల కాలంలో ఎందుకు రూ.8.15 లక్షల కోట్ల అప్పుల్లో కూరుకు పోయిందో తెలంగాణ సమాజం ఆలోచించాల్సిన అవసరం ఉందని అన్నారు. రాష్ట్రం అప్పుల్లో కూరుకు పోతే కేసీఆర్ కుటుంబానికి పత్రికలు, ఛానెళ, ఫామ్‌హౌస్‌లు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. గత సర్కార్ హయాంలో కనీసం ధర్నా చౌక్‌లో నిరసన తెలిపే హక్కు లేకుండా దాన్ని మూసేశారని విమర్శించారు. కేసీఆర్ రూ. లక్ష కోట్లకు పైగా ఖర్చు చేసి నిర్మించిన కాళేశ్వరం మూడేండ్లకే కూలిపోయిందని ఆరోపించారు. "ఉట్టి తెగిపడాలని మాజీ సిఎం రోజూ శాపనార్థాలు పెడుతున్నారు. పిల్లి శాపనార్థాలకు ఉట్టి తెగిపడదని ఆయన గుర్తుంచుకోవాలి. కపట నాటక సూత్రధారి మళ్లీ బయటకు వచ్చాడు. తెలంగాణ సమాజం ఆయన మాటలు నమ్మి మోసపోవద్దు" అని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.వెయ్యిగా ఉన్న గ్యాస్ సిలిండర్‌ను రూ.500కే ఇస్తున్నామని చెప్పారు. తొలి ఏడాదిలోనే 60 వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేశామని చెప్పారు. పేదలకు సన్న బియ్యం, ఆర్‌టిసిలో మహిళలకు ఉచిత రవాణా, గిగ్ వర్కర్లకు ప్రత్యేక పాలసీ ఇలా అధికారం చేపట్టిన 15 నెలల్లోనే అనేక సంక్షేమ పథకాలను ప్రవేశ పెట్టామని వివరించారు. విద్యలో నాణ్యతను పెంచేందుకు అనేక చర్యలు చేపట్టామని సీఎం పేర్కొన్నారు. ఈ క్రమంలోనే ఐటీఐలను ఆడ్వాన్స్‌డ్ ట్రెనింగ్ సెంటర్లు (ఎటిసి)గా మార్చుతున్నామని చెప్పారు. "రాష్ట్రంలోని వంద నియోజక వర్గాల్లో రూ.2,400 కోట్లతో వీటిని ఏర్పాటు చేస్తున్నాం. ఇంజనీరింగ్ విద్యలో ప్రస్తుతం పరిశ్రమల అవసరాలకు తగిన కోర్సులు లేవు. కాలానుగుణంగా వస్తున్న మార్పులకు విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంచాలని స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేశాం. దేశంలో ఏరాష్ట్రం అమలు చేయని సంక్షేమ, అభివృద్ధి పథకాలను అమలు చేస్తున్నాం. అన్నింటా దేశానికి తెలంగాణ రోల్ మాడల్‌గా నిలుస్తోంది. తెలంగాణ రైజింగ్‌ను ఆపడం ఎవరి తరం కాదు" అని సిఎం ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన పలువురికి శ్రమశక్తి, ఉత్తమ యాజమాన్య అవార్డులను అందజేశారు.

అభివాదం చేస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

మోడీ ప్రభుత్వాన్ని సాగనంపే వరకు ఉద్యమాలు ఉధృతం

- మే డే వేడుకల్లో బి వెంకట్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

కార్మిక, కర్షక చట్టాలను కాలరాస్తున్న మోడీ ప్రభుత్వాన్ని సాగనంపే వరకు వ్యవసాయ కార్మిక, రైతాంగ ఉద్యమాలను దేశవ్యాప్తంగా ఉధృతం చేస్తామని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ అన్నారు. మే డే సందర్భంగా గురువారం తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యాలయంలో పతాకావిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కనీస మద్దతు ధరల చట్టాన్ని తీసుకొస్తానని మోడీ హామీ ఇచ్చి మోసం చేశారని తెలిపారు. వ్యవసాయ కార్మికుల కనీస వేతనాల అమలకు ఎలాంటి చర్యలూ చేపట్టలేదని చెప్పారు. బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగంలో కల్పించిన ప్రజాతంత్ర హక్కులను, చట్టాలను ఎత్తివేసే కుట్ర చేస్తోందన్నారు. కనీస వేతనాలు పెరగకపోవడం వల్ల ప్రజల జీవన ప్రమాణాలు పడిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. మోడీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా మే 20న దేశవ్యాప్తంగా గ్రామీణ సమ్మె జరుగుతుందని.. జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సాగర్, సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్, తెలంగాణ వ్యకాస రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్రాములు, రైతు సంఘం సీనియర్ నాయకులు సారంపల్లి మల్లారెడ్డి, బి.పద్మ, రాష్ట్ర కమిటీ సభ్యులు ఆర్.ఆంజనేయులు, డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్, నాయకులు చంద్రరెడ్డి, అరి బండి ప్రసాద్ రావు, ఐఎఎస్ ఆకాడమీ ఎఓ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌ల రద్దు కోసం పోరాటం

20న సమ్మెను జయప్రదం చేయండి : పాలడుగు భాస్కర్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

లేబర్ కోడ్‌ల రద్దు కోసం కార్మికులు పోరాటాల్లోకి రావాలనీ, ఈ నెల 20న తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కార్మికవర్గానికి సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ పిలుపునిచ్చారు. గురువారం హైదరాబాద్‌లోని సీఐటీయూ రాష్ట్ర కార్యాలయం వద్ద ఆ యూనియన్ జాతీయ కౌన్సిల్ సభ్యులు ఎం.నాగేశ్వర్‌రావు అధ్యక్షతన మేడే ఉత్సవాలను నిర్వహించారు. సీఐటీయూ జెండాను ఆ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.వీరయ్య ఎగురవేశారు. అనంతరం పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ... ఎనిమిది గంటల పనివిధానం కోసం చికాగో నగరంలోని హే మార్కెట్ వద్ద 1886లో జరిగిన పోరాట చరిత్రను వివరించారు. చికాగో వీరుల త్యాగాలతో సాధించుకున్న 8 గంటల పని దిన హక్కును కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం హరిస్తున్న తీరును ఎండగట్టారు. నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చి 29 చట్టాలను కాలరాసే ప్రయత్నం చేస్తున్నదని విమర్శించారు. ఈ నేపథ్యంలో మోడీ సర్కారు కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొడుతూ మే 20న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఎస్. వీరయ్య మాట్లాడుతూ.. జమ్మూ కాశ్మీర్‌లో ఉగ్రవాదులు చేసిన దాడిని హిందూ-ముస్లింల దాడిగా చిత్రీకరించడాన్ని తప్పుబట్టారు. అక్కడ పని చేసే గైడ్, సవారీ చేస్తున్న వారు తనను ఇంటి వరకు తీసుకెళ్ళి వదిలారనీ, నా భర్తను కోల్పోయినా ఇద్దరు అన్నలను పొందానని కేరళ మహిళ పేర్కొన్నదని గుర్తుచేశారు. ఆర్‌ఎస్‌ఎస్ ఈ ఘటనను పక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నదని విమర్శించారు. దేశ సమైక్యతను కాపాడుకుంటానే కార్మిక హక్కుల సాధన కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ మాట్లాడుతూ.. రైతు వ్యతిరేక చట్టాలను వెనక్కికొట్టిన మాదిరిగానే లేబర్ కోడ్‌లను తిప్పి కొట్టాలని కార్మికులకు పిలుపునిచ్చారు. 20న తలపెట్టిన సార్వత్రిక సమ్మెలో కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. తెలంగాణ రైతు సంఘం ప్రధాన కార్యదర్శి టి.సాగర్, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకట్రాములు మేడే సందేశాన్నిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐకేఎస్ ఉపాధ్యక్షులు సారంపల్లి మల్లారెడ్డి, సీనియర్ నాయకులు డాక్టర్ అరిబండి ప్రసాద్‌రావు, బొంతల చంద్రారెడ్డి, వ్యవసాయ కార్మిక రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.ప్రసాద్, బి.పద్మ, రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్ నాయక్, ఐద్వా అధ్యక్షులు అరుణ, రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి. ఆశయ్య, డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి కోట రమేష్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రజినీకాంత్, టి నాగరాజు, ఐఏఎస్ అకాడమీ కోచింగ్ సెంటర్ ఎఓ. సతీష్, ఇన్సూరెన్స్ రంగం నాయకులు, కెవిఎస్ఎన్ రాజు, సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యురాలు ఎ. సునీత తదితరులు పాల్గొన్నారు.

'ఆటిజం'పై అవగాహన కల్పించాలి

- టివిసిసి చైర్మన్ ఎం వీరయ్య

ప్రజాశక్తి -హైదరాబాద్‌బ్యూరో

ఆటిజం రుగ్మతపై ప్రజల్లో అవగాహన కల్పించాలని తెలంగాణ వికలాంగుల కో ఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య అన్నారు. అటిజం, మానసిక వైకల్యం ఉన్న వికలాంగులను ప్రభుత్వం ఆదుకుంటుందని తెలిపారు. సహారా ఇన్‌స్టిట్యూట్ అఫ్ రిహాబిలిటేషన్ అండ్ డెవలప్‌మెంట్ స్టడీస్, వికలాంగుల హక్కుల జాతీయ వేదిక సంయుక్తాధ్వర్యంలో బేగంపేటలోని టూరిజం ప్లాజాలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో తొలిసారిగా 1500మంది స్పెషల్ టీచర్స్‌ను నియామకం చేశామని చెప్పారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు అడ్మిషన్స్ ఇచ్చే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్పీఆర్డీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎమ్ అడివయ్య మాట్లాడుతూ 2016 వికలాంగుల హక్కుల పరిరక్షణ చట్టం ప్రకారం 21 రకాల వైకల్యాలు ఉన్నాయనీ, వాటిలో అటిజం, సెరిబ్రాల్‌పాల్సీ, బుద్ధిమాంద్యత, మానసిక వైకల్యం కలిగిన వాళ్ల తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. అటిజం, మానసిక వైకల్యం కలిగిన వారికి సదరం సర్టిఫికెట్, యూనిక్ డిసెబుల్డ్ ఐడి కార్డ్స్ లేకపోవడం వల్ల ప్రభుత్వ పథకాలు అందడం లేదని తెలిపారు. చైల్డ్ డెవలప్‌మెంట్ సెంటర్స్, స్పెషల్ ఎడ్యుకేషన్ విద్యా సంస్థలు, స్పీచ్, హియరింగ్ కేంద్రాల్లో ఫీజుల నియంత్రణకు చట్టం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎన్‌పిఆర్‌డి రాష్ట్ర కోశాధికారి ఆర్ వెంకటేష్, పిడియాట్రిక్ న్యూరాలజిస్ట్ డాక్టర్ ప్రశాంత్ ఉటగే, రిహాబిలిటేషన్ స్పెషలిస్ట్ డాక్టర్ శ్రవణ్‌కుమార్‌రెడ్డి, టజేఎస్ఎల్‌పిఏ సభ్యులు భవ్య, శ్రీపూజ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు మంజూరు చేయండి

- సిఎస్ రామకృష్ణారావుకు ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి విజ్ఞప్తి

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

సిఎస్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి

రాష్ట్రంలోని ఉద్యోగులు, ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులను మంజూరు చేయాలని ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు నూతనంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సిఎస్)గా పదవీ బాధ్యతలు చేపట్టిన రామకృష్ణారావును గురువారం హైదరాబాద్‌లోని సచివాలయంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. విద్యారంగ సమస్యలు, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. గురుకులాల సమయపాలనను మార్పు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పిఆర్‌టియుటిఎస్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గుండు లక్ష్మణ్, పుల్గం దామోదర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ బి మోహన్‌రెడ్డి, మాజీ అధ్యక్షులు పి వెంకట్‌రెడ్డి, జీహెచ్ఎం సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాజగంగారెడ్డి, గిరిధర్‌గౌడ్, పిఆర్‌టియుటిఎస్ జిల్లా అధ్యక్షులు మోహన్‌రెడ్డి, రామేశ్వర్‌గౌడ్ పాల్గొన్నారు.

మే డే స్ఫూర్తితో ఐక్య పోరాటాలు

- 4 లేబర్ కోడ్స్ అమలైతే కార్మికవర్గం ఉనికే ప్రశ్నార్థకం
- కనీస వేతనాల అమలుకు పోరాటం
- 20న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేద్దాం : చుక్క రాములు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సభలో మాట్లాడుతున్న చుక్క రాములు

ప్రపంచ కార్మికుల దీక్ష దినం మే డే త్యాగనిరతి, పోరాట పటిమ, స్ఫూర్తితో ఐక్య పోరాటాలు ఉధృతం చేస్తామని సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు చుక్క రాములు అన్నారు. సంగారెడ్డి జిల్లా పాశంమైలారంలోని కిర్బీ, పటాన్‌చెరులోని శాండ్విక్, సిబిఎల్ పరిశ్రమల్లో గురువారం నిర్వహించిన మే డే కార్యక్రమాల్లో జెండావిష్కరణ చేశారు. ఆయా కంపెనీల కార్మికులు బైక్ ర్యాలీగా సంగారెడ్డి సభా స్థలికి చేరుకున్నారు. అనంతరం స్థానిక ఐబి సెంటర్‌లో నిర్వహించిన సభలో చుక్క రాములు మాట్లాడారు. 1886లో అమెరికాలోని చికాగోలో హే మార్కెట్ వద్ద పని దినాల తగ్గింపు, చట్టపరమైన సదుపాయాల కోసం పెద్దఎత్తున పోరాడితే అక్కడి ప్రభుత్వం కాల్పులు జరిపి ఆరుగురి ప్రాణం తీసిందని వివరించారు. ప్రాణాలను ఫణంగా పెట్టి పోరాడిన కార్మికుల సంఘటిత శక్తి వల్లే ఎనిమిది గంటల పని విధానం చట్టబద్ధమైందన్నారు. పోరాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను కేంద్రంలో బిజెపి ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్స్‌గా మార్చి పెట్టుబడిదారులకు, కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా నిర్ణయాలు చేస్తూ కార్మిక వర్గానికి తీరని అన్యాయం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రం అనుసరిస్తున్న ప్రజా, కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలను పోరాటాల ద్వారానే తిప్పిగొట్టగలమన్నారు. ఎనిమిది గంటల పని విధానాన్ని కాపాడుకునేందుకు కార్మికులు పెద్దఎత్తున పోరాడాల్సిన అవసరమేర్పడిందన్నారు. లేబర్ కోడ్స్ అమల్లోకి వస్తే కార్మికవర్గం ఉనికే ప్రశ్నార్థకం అవుతందన్నారు. పర్మినెంట్ పద్ధతి లేకుండా చేసి కాంట్రాక్టు, వలస కార్మికులకు తక్కువ వేతనాలిచ్చి శ్రమ దోపిడీకి పాల్పడేందుకు లేబర్ కోడ్స్ దోహదపడతాయన్నారు. కనీస వేతనాలు అమలు చేయకపోవడం వల్ల కోట్లాది మంది కార్మికులు శ్రమ దోపిడీకి గురవుతున్నారని తెలిపారు. 12 గంటల పని విధానం తీసుకొచ్చి కార్పొరేట్ శక్తుల లాభాలు పెంచేలా కేంద్రం వ్యవహరిస్తోందన్నారు. మరోపక్క కార్మికుల్ని విభజించేందుకు మతం పేరుతో కుట్రలు చేస్తోందని విమర్శించారు.

కనీస వేతనాల సవరణ జీవోలను అమలు చేయాలని హైకోర్టు చెప్పినా నిర్లక్ష్యం చేయడం సరైందికాదన్నారు. కార్మికులకు రోజుకు రూ.178 వేతనం ఇస్తే సరిపోతుందని మోడీ చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. పెరిగిన ధరలు, అవసరాలరీత్యా కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్మిక వర్గం తమ హక్కుల కోసం, చట్టాల రక్షణ కోసం, రాజ్యాంగ పరిరక్షణ కోసం పెద్దఎత్తున పోరాటాల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. జాతీయ స్థాయిలో ఈనెల 20 కార్మిక సంఘాలు నిర్వహించే సార్వత్రిక సమ్మె పోరాటాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమాల్లో సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.సాయిలు, జిల్లా కోశాధికారి కె.రాజయ్య, జిల్లా ఉపాధ్యక్షులు పాండురంగారెడ్డి, బాగారెడ్డి, సహాయ కార్యదర్శి ఎం.యాదగిరి, నాయకులు ప్రసన్నరావు, సురేష్, బీంరెడ్డి, కొండల్‌రెడ్డి పాల్గొన్నారు.

సైనికులకు ఒపిఎస్ అమలు చేయాలి

- ఎన్ఎంఒపిఎస్ సెక్రెటరీ జనరల్ స్థితప్రజ్ఞ
- ఉగ్రదాడులను ఖండిస్తూ కొవ్వొత్తుల ప్రదర్శన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేశంలో జరుగుతున్న ఉగ్రదాడుల నేపథ్యంలో గురువారం యూపీఎస్ విధానాన్ని వ్యతిరేకిస్తూ ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద జరగాల్సిన నిరసనను వాయిదా వేశామని నేషనల్ మూవ్‌మెంట్ ఫర్ ఓల్డ్ పెన్షన్ స్కీం (ఎన్ఎంఒపిఎస్) సెక్రెటరీ జనరల్ స్థితప్రజ్ఞ అన్నారు. గురువారం హైదరాబాద్‌లోని నాంపల్లి అమర వీరుల స్థూపం వద్ద ఉగ్రదాడులను ఖండిస్తూ కొవ్వొత్తుల ప్రదర్శనను నిర్వహించామని చెప్పారు. ఉగ్రవాదుల చర్య అత్యంత హేయమని విమర్శించారు. దేశం యావత్తు ఈ ఘటనను ఖండించాలని అన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు దేశాన్ని రక్షించుకోవాల్సిన అవసరముందన్నారు. సీఆర్పీఎఫ్, బీఎస్ఎఫ్, పారామిలిటరీ బలగాల్లోని సైనికులకు పాత పెన్షన్ విధానం (ఒపిఎస్)ను అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. ఇందుకోసం ప్రధాని నరేంద్ర మోడీకి లేఖ రాశామన్నారు. టిఎస్‌సిపిఎస్ఇయు కోశాధికారి నరేష్‌గౌడ్ మాట్లాడుతూ ఉగ్రవాదులపై కేంద్ర ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు శ్యాంసుందర్, రాష్ట్ర బాధ్యులు నటరాజ్, సుశీల్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మీరొచ్చినా సరే...మమ్మల్ని రమ్మన్నా సరే!

జనగణనలో కులగణనను స్వాగతిస్తున్నాం : సిఎం రేవంత్‌రెడ్డి

ప్రజాశక్తి -హైదరాబాద్‌బ్యూరో

జనగణనతో పాటే కులగణన కూడా చేయాలనే కేంద్రప్రభుత్వ నిర్ణయాన్ని సంపూర్ణంగా స్వాగతిస్తున్నామని ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి అన్నారు. దీనికోసం కేంద్రానికి అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. కేంద్రం నుంచి మంత్రులు లేదా అధికారుల బృందం రాష్ట్రానికి వచ్చినా, లేదా మమ్మల్నే ఢిల్లీకి రమ్మన్నా ఈ విషయంలో వారికి సహకారాన్ని అందిస్తామని గురువారంనాడిక్కడి సీఎం నివాసంలో జరిగిన విలేకరుల సమావేశంలో చెప్పారు. రాహుల్‌గాంధీ ఆలోచనల్ని కేంద్రంలోని మోడీ ప్రభుత్వం అమల్లోకి తీసుకురావడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. రాహుల్‌గాంధీ నేతృత్వంలోనే తెలంగాణలో కులగణనను సంపూర్ణ పారదర్శకంగా నిర్వహించామనీ, ఇదే కేంద్రానికి రోల్‌మోడల్‌గా నిలుస్తుందన్నారు. ఇప్పటికే బిజెపి పాలిత రాష్ట్రాల్లో ఇదే తరహా కులగణన చేపట్టి ఉంటే తాము ఈ మాట చెప్పేవాళ్లం కాదని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని బిజెపి నేతల పరిస్థితి కక్కలేక, మింగలేక అన్నట్టు ఉందనీ, అందుకే వాళ్లు ఏం మాట్లాడుతున్నారో వారికే అర్థం కావట్లేదన్నారు. కేంద్రంలోని మోడీ మైనారిటీ సర్కార్‌ను 240 సీట్లకే పరిమితం చేయబట్టే, వారు రిజర్వేషన్లు, రాజ్యాంగ జోలికి వెళ్లే సాహసం చేయట్లేదనీ, ఈ విషయంలో తాము ప్రజలను అప్రమత్తం చేస్తే, అది ఫలించిందని ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. జనగణనతో పాటు కులగణన చేయాలనీ, 50 శాతం రిజర్వేషన్ల పరిమితి ఎత్తేయాలని రాష్ట్ర అసెంబ్లీలో తమ ప్రభుత్వం తీర్మానం చేసిందని గుర్తుచేశారు. కేంద్ర ప్రభుత్వం జనగణనలో కులగణనను ఎప్పుడు ప్రారంభించి, ఎప్పుడు ముగిస్తారో నిర్ణీత షెడ్యూల్‌ను ప్రకటించాలని కోరారు. విధివిధానాల ఖరారుపై అఖిలపక్ష సమావేశం నిర్వహించి, వాటిని పబ్లిక్ డొమైన్‌లో పెట్టి, ప్రజల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించాలని సూచించారు. కేంద్ర మంత్రుల కమిటీతో పాటు మేధావులు, పౌరసమాజ ప్రతినిధులను కూడా ఈ ప్రక్రియలో భాగస్వాముల్ని చేయాలని చెప్పారు. రాష్ట్రంలో కులగణనను పార్టీ కార్యక్రమంగా తాము చేపట్టలేదనీ, ప్రతిపక్షాలు, మేధావులు, పౌరసమాజం సహా అన్ని వర్గాలను దీనిలో భాగస్వాముల్ని చేశామన్నారు. 50 శాతం రిజర్వేషన్ల సీలింగ్ ఎత్తివేసి, బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలని చెప్పారు. ఈ విషయంలో కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం తరపున సంపూర్ణ సహాయ సహకారాలు అందిస్తామని పునరుద్ఘాటించారు. సమావేశంలో ప్రభుత్వ సలహాదారు కే కేశవరావు తదితరులు పాల్గొన్నారు.

సిఎంకు అభినందనల వెల్లువ

జనగణనతో పాటు కులగణన కూడా చేపట్టాలని కేంద్ర మంత్రివర్గం నిర్ణయించిన నేపథ్యంలో ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో పలువురు ప్రజా ప్రతినిధులు అభినందించారు. రాష్ట్రంలో విజయవంతంగా కులగణన చేపట్టి, దేశానికి ఆదర్శంగా నిలిచారని ప్రసంసించారు. సీఎంను అభినందించిన వారిలో మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహాదారు కే కేశవరావు, మాజీ ఎంపీలు వీ హన్మంతరావు, అంజన్‌కుమార్ యాదవ్, మధు యాష్కీ, బీసీ సంఘాల నాయకులు ఉన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ ఈ అభినందనలు అన్నీ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీకి చెందుతాయనీ, ఆయన దిశానిర్దేశంలోనే రాష్ట్రంలో కులగణను విజయవంతంగా చేపట్టగలిగామని తెలిపారు.

రైతుల మాదిరిగా కార్మికుల సంఘటిత ఉద్యమం

- ఐక్యతను ఎదుర్కొనే శక్తి ఎవరికీ లేదు : ప్రొఫెసర్ హరగోపాల్
- బ్యాంకింగ్, ఇన్సూరెన్స్ రంగ ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో మేడే

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నల్ల చట్టాలకు వ్యతిరేకంగా రైతులు నెరిపిన చారిత్రాత్మక ఉద్యమం మాదిరిగా కార్మికులు సంఘటితంగా ఉద్యమించాలని ప్రొఫెసర్ హరగోపాల్ సూచించారు. ఐక్య ఉద్యమాల ముందు ప్రపంచంలో ఏ శక్తి నిలబడలేదని తెలిపారు. అందుకే రైతు ఉద్యమాలతో కేంద్ర ప్రభుత్వం నల్ల చట్టాలను వెనక్కి తీసుకుందని గుర్తుచేశారు. బ్యాంకింగ్, ఇన్సూరెన్స్ రంగ ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో గురువారం హైదరాబాద్‌లోని ఎల్ఐసి డివిజనల్ కార్యాలయంలో ఎల్ఐసి జోనల్ లీడర్ జి.తిరుపతయ్య అధ్యక్షతన మేడే ఉత్సవాలు నిర్వహించారు. జెండావిష్కరణ అనంతరం "నేటి భౌగోళిక రాజకీయ పరిస్థితులు- మేడే ప్రాముఖ్యత" అనే అంశంపై సభ నిర్వహించారు. ఈ సందర్భంగా హరగోపాల్ మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో కార్పొరేట్ల ప్రవేశాన్ని కూడా రైతులు తిప్పికొట్టారని గుర్తుచేశారు. యూనియన్ల ప్రాధాన్యతను తగ్గించాలన్న కార్పొరేట్ల కోరికను తీర్చే క్రమంలో కేంద్ర ప్రభుత్వం కార్మిక వ్యతిరేక నిర్ణయాలను ముందుకు తెస్తున్నదని తెలిపారు. పాత పెట్టుబడీదారీ విధానానికి భిన్నంగా స్థిరత్వం లేని పెట్టుబడితో ఆర్థికంగా ఎదిగిన వారు ఎక్కువగా ప్రపంచంలో పాలకులుగా మారుతున్నారని ప్రస్తుత పరిణామాలను వివరించారు. వస్తు తయారీతో సంబంధం లేకుండా రియల్ ఎస్టేట్ లాంటి వాటితో వస్తున్నారని అమెరికా అధ్యక్షులు ట్రంప్‌ను ఉదహరించారు. ఇలాంటి వారు తీసుకునే నిర్ణయాలు కూడా స్థిరంగా ఉండటం లేదని చెప్పారు. ప్రపంచ పెట్టుబడీదారులంతా ఐక్యంగా ఉన్నారని చెప్పారు. ఇప్పటికీ సంఘటిత రంగంలో ఉన్న మూడు శాతం ఉండగా, 97 శాతం మంది అసంఘటిత రంగంలో ఉన్నారని గుర్తుచేశారు. విశాల ప్రాతిపదికన కార్మికులు, ఉద్యోగులు ఐక్యంగా ముందుకెళ్లాలని అభిప్రాయపడ్డారు. యూనియన్లు కేవలం వర్కర్ల హక్కుల సాధన కోసమే పరిమితం కాకుండా ప్రజల దుస్థితికి - పాలకుల విధానాలకు మధ్య ఉన్న సంబంధాలపై ప్రజలను చైతన్యం తెచ్చే దిశగా కృషి చేయాలని కోరారు. పోరాట ఫలితంగా వచ్చిన రాజ్యాంగ హక్కులను కాపాడుకోవాల్సిన పరిస్థితి తిరిగి వచ్చిందని తెలిపారు. సంపద ఒకే దగ్గర కేంద్రీకృతం కావడం చట్టవిరుద్ధమని స్పష్టం చేశారు.

మేడే ఉత్సవాల్లో మాట్లాడుతున్న ప్రొ హరగోపాల్

ఆల్ ఇండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఏఐఐఈఏ) ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ మిశ్రా మాట్లాడుతూ ఐక్యంగా ఉంటే కేంద్ర ప్రభుత్వాన్ని దారిలోకి తెచ్చుకోవచ్చనేందుకు కులగణన చేయాలని తీసుకున్న నిర్ణయమే తార్కాణమని తెలిపారు. కులగణన చేస్తే దేశమే విచ్ఛిన్నం అవుతుందని గగ్గోలు పెట్టిన పాలకులు ఐక్యంగా వచ్చిన డిమాండ్‌కు తలొగ్గక తప్పని పరిస్థితి ఏర్పడిందని వివరించారు. దేశంలో ఏదో ఒక చోట ఎన్నికలున్న సమయంలో సరిహద్దుల్లో ఉద్రిక్త పరిస్థితులుంటున్నాయని హిందీ కవి రాసిన కవితను వినిపించారు. ప్రజలపై ఆర్థికంగా, రాజకీయంగా, భావజాలపరంగా మూడు రకాల దాడులు జరుగుతున్నాయని చెప్పారు. ప్రభుత్వ రంగ సంస్థల్లో ఖాళీలు ఏర్పడితే వాటిని భర్తీ చేయడం లేదన్నారు. కార్మికులకు హక్కులు దక్కకుండా తెస్తున్న 4 లేబర్ కోడ్ లను ఆపి తీరుతామని హెచ్చరించారు. యూనియన్ల హక్కులపై, ప్రభుత్వ రంగ సంస్థలపై దాడి జరుగుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను చవకగా అమ్మేస్తున్నారనీ, దేశ సంపదను కార్పొరేట్లకు దోచి పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వీటిని ప్రశ్నించకుండా కులం, మతం, ప్రాంతం, భాష తదితరాల పేరుతో విడదీసే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. తాము దైవంగా భావించే రాముడిని బీజేపీ రాజకీయ పెట్టుబడిగా భావిస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉత్తర్ ప్రదేశ్ ఎన్నికలకు ముందు అయోధ్య రాముడు, పంజాబ్ ఎన్నికలకు ముందు రాం రహీం, గుజరాత్ ఎన్నికలకు ముందు ఆశారాం బాపు ...ఇలా రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకుంటుందని మండిపడ్డారు. అనంతరం మే 20న సార్వత్రిక సమ్మె నేపథ్యంలో 20 రోజుల పాటు నిర్వహించనున్న ఆన్‌లైన్ క్విజ్ లింక్‌ను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏఐఐఈఏ జాయింట్ సెక్రెటరీ టీవీఎన్ఎస్ రవీంద్రనాథ్, వెంకట్రామయ్య (బెఫీ), సతీష్ (బెఫీ), సుబ్బారావు (జీఐసీ), రవికాంత్ (ఆర్బీఐ), నాగేశ్వర్ రావు (ఆర్బీఐ), శ్రీనివాస్ (యూబీఐ), మహేశ్ (నాబార్డ్) తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు పలువురు ఉద్యోగులు చైతన్య గీతాలను ఆలపించారు. నాలుగు లేబర్ కోడ్‌లు వస్తే ఉద్యోగులు, కార్మికుల పరిస్థితి ఎంత దుర్భరంగా మారుతుందో వివరించే స్కిట్‌ను ప్రదర్శించి ఆలోచింపజేశారు.

మేడే స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలు

- కులగణనకు కేంద్రం కాలపరిమితి విధించాలి
- కార్పొరేట్లకు వనరులను కట్టబెట్టేందుకే ఆపరేషన్ కగార్
- కాళేశ్వరంపై అఖిలపక్షం నిర్వహించాలి : జాన్‌వెస్లీ డిమాండ్
- ఎంబి భవన్ వద్ద మేడే వేడుకలు

మేడే వేడుకల్లో జండా ఆవిష్కరిస్తున్న జాన్ వెస్లీ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మేడే స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలను నిర్మించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ పిలుపునిచ్చారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం జనగణనతోపాటు కులగణనను చేపడతామంటూ ప్రకటించిందనీ, దానికి నిర్దిష్ట కాలపరిమితిని విధించాలని డిమాండ్ చేశారు. గురువారం హైదరాబాద్‌లోని సిపిఎం రాష్ట్ర కార్యాలయం ఎంబీ భవన్‌లో మేడే వేడుకలను నిర్వహించారు. అరుణపతాకాన్ని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ ఆవిష్కరించారు. 'మేడే వర్ధిల్లాలి, ఎర్రజెండా వర్ధిల్లాలి, వర్ధిల్లాలి కార్మికవర్గ పోరాటాలు, ప్రపంచ కార్మికులారా ఏకంకండి'అని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆనాడు ఎనిమిది గంటల పనివిధానం కోసం కార్మికులు పోరాడితే కేంద్రంలోని మోడీ ప్రభుత్వం 12 గంటల పనివిధానాన్ని అమలు చేస్తున్నదని విమర్శించారు. కనీస వేతనాలు అమలు కావడం లేదన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను కేంద్రం కాలరాస్తున్నదని చెప్పారు. సమస్యల పరిష్కారం కోసం సమ్మె చేసే హక్కు లేకుండా లేబర్ కోడ్‌లను తెస్తున్నదని అన్నారు. పెట్టుబడిదారులు దోపిడీ చేసేందుకు అనుకూలంగా చట్టాలను మారుస్తున్నదని విమర్శించారు. రైతాంగం కనీస మద్దతు ధర కోసం ఉద్యమిస్తే భూమి నుంచి వారిని దూరం చేసి కార్పొరేట్లకు అప్పగించే కుట్ర చేస్తున్నదని చెప్పారు. రైతులు అప్పులపాలై ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. బిజెపి అధికారంలోకి వచ్చాక లక్షకుపైగా రైతులు ఆత్మహత్య చేసుకున్నారని వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయ కూలీల ఉపాధి హామీ పనికి రూ.2.50 లక్షల కోట్లు కావాలని అడిగితే రూ.86 వేల కోట్లు మాత్రమే బడ్జెట్‌లో కేంద్రం కేటాయించిందని విమర్శించారు. ఉపాధి హామీ పనులను కల్పించే బాధ్యత నుంచి కేంద్రం తప్పుకుంటున్నదని అన్నారు. శ్రామికులు, రైతులు, వ్యవసాయ కూలీలకు వ్యతిరేకంగా పాలన సాగిస్తున్నదని చెప్పారు. దేశ సంపదను కార్పొరేట్లకు దోచిపెడుతున్నదని విమర్శించారు. ఒక శాతం సంపన్నుల వద్ద 40 శాతం సంపద పోగయ్యిందన్నారు. 50 శాతం ప్రజల వద్ద మూడు శాతం సంపద ఉందని వివరించారు. ఆర్థిక అసమానతలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పనిచేసే హక్కు లేదనీ, ఉపాధి అవకాశాలు తగ్గాయని అన్నారు. నిరుద్యోగ సమస్య తీవ్రమవుతున్నదని చెప్పారు. ధరలు పెరుగుతున్నాయని వివరించారు. రేషన్ కార్డు మీద 14 రకాల సరుకులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కానీ ప్రభుత్వాలు దాన్ని పట్టించుకోవడం లేదన్నారు. పేదలకు నిలువ నీడ లేదని చెప్పారు. గుడిసెలు వేసుకుంటామంటే తొలగిస్తున్నారని అన్నారు. ఇంటి స్థలాలను కేటాయించి ఇండ్లను నిర్మించాలని డిమాండ్ చేశారు. విద్యావైద్యం వ్యాపారంగా మారాయని విమర్శించారు. పెట్టుబడిదారులు, ధనికులు దోపిడీ చేస్తున్నారని చెప్పారు. ప్రభుత్వరంగంలోనే అందరికీ ఉచితంగా నాణ్యమైన విద్యను అందించాలని డిమాండ్ చేశారు. సామాజిక అసమానతలకు వ్యతిరేకంగా సామాజిక న్యాయం కోసం పోరాడాల్సిన అవసరముందన్నారు. స్త్రీ, పురుష అసమానతలు, సామాజిక అసమానతలు, ఆర్థిక అసమానతలు, దోపిడీకి వ్యతిరేకంగా పోరాటం చేయాలని జాన్‌వెస్లీ ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. పెట్టుబడిదారీ వ్యవస్థకు వ్యతిరేకంగా సోషలిస్టు వ్యవస్థకు అనుకూలంగా పోరాటాలు చేయాలనీ, అదే నిజమైన ప్రత్యామ్నాయమని అన్నారు. సోషలిస్టు వ్యవస్థ కోసం శ్రామికులంతా ఐక్యంగా పోరాడాలన్నారు. అప్పుడే సమస్యలన్నీ పరిష్కారమవుతాయని చెప్పారు. ఈనెల 20న కార్మిక సంఘాలు తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెకు మద్దతు ప్రకటించారు. సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో గ్రామాలు, బస్తీల్లో సమ్మెకు మద్దతుగా కార్యక్రమాలను చేపడతామని అన్నారు. ఈనెల ఎనిమిదో తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా సభలు, సమావేశాలు, ప్రదర్శనలను నిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు. మేడే స్ఫూర్తితో శ్రామికవర్గ పోరాటాలను ముందుకు తీసుకెళ్తామని అన్నారు. కర్రెగుట్ట అటవీ ప్రాంతంలోని ఖనిజ సంపదను, వనరులను కార్పొరేట్లకు కట్టబెట్టేందుకే ఆపరేషన్ కగార్‌ను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేపట్టిందని విమర్శించారు. మావోయిస్టులతో శాంతి చర్చలను జరపాలనీ, ఆపరేషన్ కగార్‌ను ఆపాలని డిమాండ్ చేశారు. కాళేశ్వరం అవినీతికి సంబంధించి అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఎన్‌డిఎస్‌ఎ నివేదిక వివరాలను అఖిలపక్షం ముందుంచాలని సూచించారు. ఆరు గ్యారంటీల అమలుకు చర్యలు తీసుకుంటున్నామంటూ సిఎం రేవంత్‌రెడ్డి అంటున్నారని, ఆచరణలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం తప్ప ఇతర పథకాలేవీ సంపూర్ణంగా అమలు కావడం లేదన్నారు. మిగతా గ్యారంటీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

కార్మికుల హక్కులపై బిజెపి దాడి : అరుణజ్యోతి

కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దాడి చేస్తున్నదని సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు అరుణజ్యోతి విమర్శించారు. కార్మిక చట్టాలను సవరించి నాలుగు లేబర్ కోడ్‌లుగా తెస్తున్నదని అన్నారు. వ్యవసాయ కూలీలకు ఉపాధి హామీ పనులను కల్పించకుండా పనిదినాలను తగ్గించిందన్నారు. కార్మికులకు ఎనిమిది గంటల పనివిధానం అమలు చేయకుండా 12 గంటలు, 14 గంటలు పనిచేసేలా నిర్ణయాలు చేస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వడం లేదన్నారు. హక్కుల సాధన కోసం ఐక్యంగా ఉద్యమించాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎస్ వీరయ్య, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు టి సాగర్, బండారు రవికుమార్, సీనియర్ నాయకులు సారంపల్లి మల్లారెడ్డి, నంద్యాల నర్సింహారెడ్డి, బి చంద్రారెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు పి ఆశయ్య, ఆర్ వెంకట్రాములు, జె బాబురావు, అఖిలభారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

ఆందోళన చేస్తున్న రైతులు

గన్నీ బ్యాగుల కోసం రైతుల ఆందోళన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గన్నీ బ్యాగుల కొరతను తీర్చాలని కోరుతూ రైతు వేదిక ముందు రైతులు నిరసన వ్యక్తం చేశారు. నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండల పరిధిలోని పెద్దజట్రం గ్రామంలో గురువారం రైతులు ఆందోళనకు దిగారు. పెద్దజట్రం క్లస్టర్ పరిధిలో అవుసలోపల్లి, పెద్ద జట్రం, బిజ్వార్ గ్రామాలు ఉన్నాయి. ధాన్యానికి సరిపడా గన్నీ బ్యాగులు లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులెదుర్కొంటున్నారు. దీంతో రైతు వేదిక ముందు బైటాయించి నిరసన వ్యక్తం చేశారు. రైతులకు టోకెన్లు ఇచ్చి సకాలంలో గన్నీ బ్యాగులు ఇవ్వడం లేదన్నారు. ఈ విషయంపై పీఏసీఎస్ ఇన్‌చార్జి విద్యాసాగర్ 'నవతెలంగాణ' వివరణ కోరగా.. రైతులకు గన్నీ బ్యాగులు పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు.

జనగణనలోనే కులగణనను స్వాగతిస్తున్నాం

- తెలంగాణకు కాంగ్రెస్ విలన్ అనడం అర్థరహితం
- రాష్ట్ర బిల్లు ఆమోదంలో సోనియా, కెసిఆర్, సుష్మాస్వరాజ్ పాత్ర : గుత్తా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జనగణనలోనే కులగణన చేపట్టాలని కేంద్రం నిర్ణయించడాన్ని స్వాగతిస్తున్నానని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో చిట్‌చాట్ చేశారు. వివిధ రాష్ట్రాల్లో సామాజిక నేపథ్యం కారణంగా కులాల రిజర్వేషన్ అమల్లో ఉందన్నారు. ఈ అంతరాన్ని ఎలా తొలగిస్తారో క్లారిటీ ఇవ్వాలన్నారు. ముందుగా కుల గణన చేపట్టిన తెలంగాణ ప్రభుత్వానికి అభినందనలు తెలిపారు. పహల్గాం ఉగ్రదాడి తర్వాత పాకిస్తాన్‌తో తాడోపేడో తేల్చుకోవాలన్న అభిప్రాయం ప్రజల్లో కనిపిస్తోందన్నారు. పాకిస్తాన్‌తో యుద్ధం కంటే ఉగ్రవాదాన్ని సమూలంగా నిర్మూలించాలని కోరారు. తెలంగాణకు కాంగ్రెస్ విలన్ అని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అనడం అర్థరహితం అన్నారు ఆనాడు తాను ఎంపీగా పార్లమెంట్‌లో ఉన్నప్పుడు.. సోనియా గాంధీ లేకపోతే తెలంగాణ వచ్చేది కాదని స్వయంగా కెసిఆర్ ఎన్నోసార్లు చెప్పారని గుర్తు చేసుకున్నారు. కెసిఆర్ పోరాటాన్ని కూడా కాదనలేమని, అని అందుకే ప్రజలు పదేండ్లు అధికారాన్ని ఇచ్చారని అన్నారు. కానీ అందరి పోరాటాన్ని గుర్తించాలని కోరారు. తెలంగాణ బిల్లు ఆమోదంలో కెసిఆర్, సోనియాగాంధీ, సుష్మా స్వరాజ్ పాత్రలను కాదనలేమన్నారు.

సమ్మె వద్దు

- ఆర్‌టిసి కార్మికులకు మంత్రి పొన్నం విజ్ఞప్తి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టిజిఎస్‌ఆర్‌టిసి) ఆర్థికంగా ఇప్పుడిప్పుడే గాడిన పడుతుందనీ, ఇలాంటి సమయంలో కార్మికులు సమ్మె చేయొద్దని రవాణా, బిసి సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కారం చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఒక పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు. ఆర్టీసీ కార్మికుల పోరాటంతోనే స్వరాష్ట్ర సాధన సాధ్యమైందనీ, ఆ తర్వాతి పదేండ్లలో సంస్థ ఎలా తయారైందో అందరికీ తెలుసన్నారు. సంస్థలో కారుణ్య నియామకాలు, కార్మికులకు మెరుగైన వైద్యం కోసం తార్నాక ఆస్పత్రి అప్‌గ్రేడేషన్ చేశామన్నారు. టిఎ, డిఎ పెండింగ్ బకాయిలు ఇచ్చామనీ, కొత్త నియామకాలు చేపడుతూ, కొత్త బస్సులు కొనుగోలు చేస్తున్నామని వివరించారు. సమ్మె వల్ల సంస్థకు ఇబ్బందులు వస్తాయన్నారు. సమస్యలపై కూర్చుని మాట్లాడుకుందామని కార్మిక సంఘాల నాయకులకు విజ్ఞప్తి చేశారు. రిటైర్మెంట్ రోజే కార్మికులకు బెనిఫిట్స్ ఇవ్వాలనే కార్యాచరణ చేస్తున్నామని చెప్పారు. ఆర్‌టిసి సమ్మెపై కార్మిక సంఘాలు పునరాలోచన చేయాలనీ, ముందుగా ఎలాంటి విజ్ఞప్తి చేయకుండా, నేరుగా సమ్మె అన్నారని ఆక్షేపించారు.

మిల్లు ట్యాగింగ్‌లో గందరగోళం

- మందకోడిగా ధాన్యం తరలింపు
- మిల్లుల వద్ద లారీల బారులు
- బస్తాకు రూ.2 ఇవ్వాలని లారీ యజమానుల డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

చేతికొచ్చిన ధాన్యాన్ని అమ్ముకోవడానికి రైతులు రోజుల తరబడి కొనుగోలు కేంద్రాల వద్ద ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఐకెపి, పిఎసిఎస్ కేంద్రాల్లో కాంటా వేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించడానికి లారీ యజమానులు ముందుకు రావడం లేదు. నల్లగొండ జిల్లాలో అధికారులు కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఏ మిల్లులకు ఎన్ని వేల క్వింటాళ్లు కేటాయించొచ్చు.. మిల్లుల స్థితిగతులను ఆధారంగా చేయాల్సిన మిల్ ట్యాగింగ్ గందరగోళంగా మారింది. దీంతో ధాన్యం తరలింపులో ఆలస్యంతోపాటు మిల్లుల వద్ద లారీలు బారులు తీరుతున్నాయి. వెయిటింగ్ వల్ల లారీ యజమానులు అదనపు చార్జీలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.మిల్లులకు పరిమితికి మించి ధాన్యాన్ని తరలిస్తుండటంతో ఆయా మిల్లర్లు ధాన్యాన్ని దిగుమతి చేసుకోవడానికి విముఖత చూపుతున్నారు. దీంతో కొనుగోలు కేంద్రం నుంచి బయల్దేరిన లారీల అన్‌లోడ్‌కు మూడు నుంచి ఐదు రోజుల వరకు సమయం పడుతోంది. జిల్లా అధికారులు జోక్యం చేసుకుంటే తప్ప ముందుకు కదిలే పరిస్థితి లేదు. ధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి తరలింపు మందకొడిగా సాగుతోంది.

మిల్లుల వద్ద లారీల ఎదురుచూపులు

రబీ ధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యం లారీలు మిల్లులకు చేరుకున్న తర్వాత మిల్లర్ల కొర్రీలతో మూడు నుంచి ఐదు రోజులు అన్‌లోడ్ కాకుండా ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. మిల్లులో సరిపడా హమాలీలు లేకపోవడం, పరిమితికి మించి కొనుగోలు చేయడం వల్ల మిల్లులో భద్రపరచడానికి స్థలం లేక ధాన్యాన్ని దించుకోవడానికి మిలర్లు సరిగా స్పందించడం లేదు.

బస్తాకు రూ.2 ఇవ్వాలని లారీ యజమానుల డిమాండ్

కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలింపులో భాగంగా ఒప్పందం చేసుకున్న లారీ యజమానులు మిల్లుల వద్ద అన్‌లోడ్‌కు సమయం పడుతుండటంతో తమకు నష్టం ఏర్పడుతుందని గగ్గోలు పెడుతున్నారు. దీంతో బస్తాకు రెండు రూపాయల చొప్పున వెయిటింగ్ చార్జీలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. అలా అయితేనే కేంద్రాలకు లారీలు వస్తాయని, లేకుంటే ఎదురు చూడాల్సిందేనని నిర్వాహకులకు లారీ కాంట్రాక్టర్ చెబుతున్నట్టు తెలిసింది.

వెయిటింగ్ చార్జులు అడిగితే కఠిన చర్యలు కలెక్టర్ త్రిపాఠి

నల్లగొండ జిల్లా కలెక్టర్ త్రిపాఠి నార్కట్‌పల్లి మండలం ఎల్లారెడ్డిగూడెంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. వెయిటింగ్ ఛార్జీలు ఇస్తేనే సకాలంలో లారీలు వస్తాయని నిర్వాహకులకు లారీ కాంట్రాక్టర్లు చెప్పిన విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో సరిపడా లారీలు లేకపోవడం వల్ల ధాన్యం తరలింపు మందకోడిగా నడుస్తున్నదని తెలుసుకున్న కలెక్టర్ లారీ కాంట్రాక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెయిటింగ్ చార్జీలు అడిగితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అదేవిధంగా కలెక్టర్ చిట్యాలలో ఉన్న ఉదయ రైస్ ఇండస్ట్రీస్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు.

హైదరాబాద్‌లో ఆల్ట్ ఎఫ్ కోవర్కింగ్ ప్రారంభం

హైదరాబాద్ : ఢిల్లీ, ఎన్‌సిఆర్‌లో తమ కార్యకలాపాలను నిర్వహిస్తోన్న ఆల్ట్ డాట్.ఎఫ్ కోవర్కింగ్ తన కార్యకలాపాలను హైదరాబాద్‌కు విస్తరించినట్లు ప్రకటించింది. నానక్‌రామ్‌గూడ ఫైనాన్సీల్ డిస్ట్రిక్‌లో 1200 సీట్లతో దీన్ని ఏర్పాటు చేసింది. ఈ ఏడాది చివరి నాటికి హైటెక్‌సిటీలో మరో సెంటర్‌ను తెరువనున్నట్లు పేర్కొంది. నగరంలో పెరుగుతోన్న స్టార్టప్‌లు, చిన్న వ్యాపారాలను అవసరాలను తీర్చేలా డిజైన్ చేసినట్లు వెల్లడించింది.

సెన్‌హైజర్ ఉత్పత్తులపై 58 శాతం వరకు తగ్గింపు

న్యూఢిల్లీ : ఆడియో ఉత్పత్తుల కంపెనీ సెన్‌హైజర్ తన ఉత్పత్తులపై 58 శాతం వరకు తగ్గింపును అందించనున్నట్లు పేర్కొంది. అమెజాన్ సమ్మర్‌సేల్ 2025లో తమ హెడ్‌ఫోన్‌లు, మైక్రోఫోన్‌లు సహా టాప్ రేటెడ్ ఉత్పత్తులపై డిస్కౌంట్‌ను ఇస్తోన్నట్లు తెలిపింది.

శ్రీశ్రీకి ప్రేరణ ప్రోగ్రెసివ్ మ్యానిఫెస్టో

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

లక్నోలో జరిగిన ప్రోగ్రెసివ్ అసోసియేషన్ మ్యానిఫెస్టో మహాకవి శ్రీశ్రీకి ప్రేరణ కల్పించిందని ప్రముఖ కవి ఏనుగు నర్సింహారెడ్డి తెలిపారు. దానివల్లే ఆయన అద్భుతమైన సాహిత్యంతో సామాన్యులను ఉత్తేజితుల్ని చేసే సాధారణ భాషలో కవితలు రాయగలిగారని చెప్పారు. తెలంగాణ సాహితి నగర కమిటీ ఆధ్వర్యంలో సంతోష్‌నగర్‌లోని ఆలం ఖుంద్ మీర్ భవన్‌లో శ్రీశ్రీ జయంతి సందర్భంగా శ్రామిక కవి సమ్మేళనం జరిగింది. దీనికాయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. శ్రీశ్రీ కవితా ప్రస్థానాన్ని స్పష్టంగా వివరించారు. పలు కవితలను చదివి, దానివెనుకున్న సాహిత్య, విప్లవ, చైతన్య భావుకతను విశ్లేషించారు. కార్యక్రమంలో పాల్గొన్న తెలంగాణ సాహితీ రాష్ట్ర కార్యదర్శి కే ఆనందాచారి మాట్లాడుతూ ఒకప్పుడు పని గంటలు తగ్గించాలని కార్మికలోకం ఐక్యమై సమ్మె చేపట్టిందనీ, ఇప్పుడు కూడా దేశంలో అవే పరిస్థితులు ఏర్పడుతున్నాయని తెలిపారు. దీనికి కవులు, కళాకారులు మద్దతు తెలపాలని కోరారు. కార్యక్రమానికి తెలంగాణ సాహితి నగర అధ్యక్షులు ఏబూషి నరసింహ అధ్యక్షత వహించారు. మేరెడ్డి రేఖ, మహేష్ దుర్గే కవిసమ్మేళన నిర్వాహకులుగా వ్యవహరించారు. సలీమ, శరత్ సుదర్శి, ముజాహిదీన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో తల్లీకొడుకు మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పిండి గిర్నీలో విద్యుదాఘాతంతో తల్లీకొడుకులు ప్రాణం కోల్పోయారు. ఈ ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా తాండూరు మండల పరిధిలోని తుమ్మల సుగురు గ్రామంలో జరిగింది. స్థానికుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన జయమ్మ (40) పిండి గిర్నీ నడుపుతున్నారు. గురువారం గిర్నీ వద్ద షార్ట్‌సర్క్యూట్ అయ్యి జయమ్మ, ఆమె కొడుకు శ్రీకాంత్ (15) విద్యుత్‌షాక్‌కు గురై కింద పడిపోయారు. చుట్టుపక్కల ఉన్న వాళు గమనించి 108లో నాగర్‌కర్నూల్ ఏరియా ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్టు చెప్పారు.

యాజమాన్యాల కోసమే లేబర్‌కోడ్‌లు

- అవి అమలైతే కార్మికులు బానిసలే : ఎస్ వీరయ్య

భారీ ర్యాలీలో ఎస్ వీరయ్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

యాజమాన్యాల లాభాలను మరింత పెంచేందుకు కేంద్రంలోని మోడీ ప్రభుత్వం లేబర్ కోడ్‌లను అమలు చేయబోతున్నదని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.వీరయ్య విమర్శించారు. రాష్ట్రంలో ఇప్పటికే చాలా ప్రాంతాల్లో 12 గంటల పనివిధానం అమలవుతున్నదనీ, లేబర్ కోడ్‌లు వస్తే కార్మికులు కట్టుబానిసలుగా మారే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు. ఢిల్లీ రైతాంగ పోరాట స్ఫూర్తితో వాటిని తిప్పికొట్టేందుకు కార్మికులు ఐక్యంగా పోరాటాల్లోకి రావాలని పిలుపునిచ్చారు. గురువారం హైదరాబాద్‌లోని నారాయణగూడ వైఎంసీఏ చౌరస్తా నుంచి గోల్కొండ చౌరస్తా వరకు సిఐటియు గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అందులో వందలాది మంది కార్మికులు పాల్గొన్నారు. డప్పుల దరువులు..కోలాట నృత్య ప్రదర్శన ఆకట్టుకున్నాయి. నారాయణగూడ ఫ్లైఓవర్ వద్ద ఎస్ఎఫ్ఐ, చిక్కడపల్లిలో డీవైఎఫ్ఐ, ఆర్టీసీ క్రాస్‌రోడ్డులో తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం, ముషీరాబాద్‌లో ఐద్వా నాయకులు సీఐటీయూ ర్యాలీకి స్వాగతం పలికారు. అనంతరం గోల్కొండ క్రాస్ రోడ్డులోని సీఐటీయూ సిటీ కార్యాలయంలో ఆ యూనియన్ జెండాను ఎస్.వీరయ్య ఆవిష్కరించారు. అంతకు ముందు వైఎంసిఎ చౌరస్తాలో ర్యాలీ ప్రారంభం సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎనిమిది గంటల పనివిధానం కోసం చికాగో నగరంలో సాగిన పోరాటాన్నీ, అమరుల త్యాగాలను, మేడే చరిత్రను, ప్రపంచ వ్యాప్తంగా సోషలిస్టు రాజ్యాల ఏర్పాటును సోదాహరణంగా వివరించారు. తమ హక్కుల కోసం వాటన్నింటినీ పక్కనబెట్టి ఐక్యంగా ముందుకు సాగితే కేంద్రం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను తిప్పికొట్టొచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నగర అధ్యక్ష, కార్యదర్శులు జె.కుమారస్వామి, ఎం వెంకటేష్, సీనియర్ నాయకులు ఎం శ్రీనివాస్, శ్రామిక మహిళ కన్వీనర్ బి కిరణ్మయి, నగర కోశాధికారి కే అజయ్‌బాబు, నగర నాయకులు జి.రాములు, ఎం సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల హక్కులు, సంక్షేమం, చట్టాలపై దాడి

- సంఘాల్లేకుండా చేసే కుట్ర : పాలడుగు భాస్కర్
- ఇసిఐఎల్ చౌరస్తా నుంచి ఉప్పల్ చౌరస్తా వరకు బైక్ ర్యాలీ

బైక్ ర్యాలీగా వెళుతున్న సిఐటియు నాయకులు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

కార్మికుల హక్కులు, సంక్షేమం, చట్టాల మీద కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం దాడి చేస్తోందని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ అన్నారు. మే డేను పురస్కరించుకుని గురువారం సిఐటియు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఇసిఐఎల్ చౌరస్తా నుంచి ఉప్పల్ చౌరస్తా వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప్పల్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన సభలో పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ.. గిగ్ వర్కర్లకు కొత్త పథకం తీసుకొచ్చామని చెబుతున్న సిఎం రేవంత్‌రెడ్డి.. కనీస వేతనాల జీవోను సవరించాలన్నారు. దేశాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత కార్మికవర్గం మీద ఉందని చెప్పారు. దేశంలో కులం, మతం, ప్రాంతం పేరు మీద కార్మికుల మధ్య చిచ్చుపెట్టి ప్రజావ్యతిరేక విధానాలను అమలు చేస్తున్నారన్నారు. దేశంలో మోడీ కావొచ్చు, అమెరికాలో ట్రంప్ కావొచ్చు కార్మికుల చట్టాల జోలికొస్తే, కార్మికుల సంక్షేమాన్ని కాజేస్తే, ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తే తాటిచెట్టు లోతు గొయ్యి తీసి బొంద పెడతామని హెచ్చరించారు. కార్మికుల హక్కులు, సంక్షేమం కోసం మే డే స్ఫూర్తితో ఉద్యమిద్దామని పిలుపునిచ్చారు. ఈ నెల 20న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ ర్యాలీలో సీపీఐ(ఎం) మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి పి.సత్యం, కార్యదర్శివర్గ సభ్యులు కోమటి రవి, వినోద, సిఐటియు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు అశోక్, చంద్రశేఖర్, నాయకులు శ్రీనివాస్, వెంకన్న, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

సదాశివపేటలో క్షుద్ర పూజలు!

- బాలికను బలి ఇచ్చేందుకు యత్నం..!

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సంగారెడ్డి జిల్లా సదాశివపేట పట్టణంలో క్షుద్ర పూజలు కలకలం రేపాయి. ఓ బాలికను బలి ఇచ్చేందుకు యత్నించినట్టు తెలిసింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని బస్టాండ్ సమీపంలో గల బీరువా తయారీ షాపులో ఓ కుటుంబం బంగారం కోసం బాలికను బలి ఇచ్చే యత్నం చేశారు. దీని కోసం క్షుద్ర పూజలు చేయాలనుకున్నారు. అందుకు అయోధ్య నుంచి ఓ స్వామిని పిలిపించారు. బాలిక తండ్రికి భారీ మొత్తంలో డబ్బులు ఆశ చూపడంతో, పూజ చేసే ప్రాంతానికి బాలికను గుట్టుచప్పుడు కాకుండా తండ్రి తీసుకొచ్చాడు. పూజలు మంగళవారం అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో జరగ్గా.. ఈ విషయం తెలుసుకొని అక్కడకు వెళ్లిన కాలనీవాసులకు భారీ శబ్దాలు వినిపించాయి. కాలనీవాసులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అక్కడకు చేరుకుని పూజా కార్యక్రమాలను అడ్డుకున్నారు.

రేవంత్‌రెడ్డి సిఎం పదవికే గ్యారంటీ లేదు

- మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎన్ని రోజులు ముఖ్యమంత్రి పదవిలో ఉంటాడో రేవంత్‌రెడ్డికి గ్యారంటీ లేదని మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. సూర్యాపేట జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో గురువారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ గురించి కామెంట్ చేసేటోళ్లకు బిఆర్ఎస్ రజతోత్సవ సభ ఓ చెంపపెట్టు లాంటిదన్నారు. సభలో కేసీఆర్ నోట రేవంత్ మాట రాలేదనే అక్కసు ఆయనలో ఉందని ఎద్దేవా చేశారు. రేవంత్‌కు కాంగ్రెస్ పార్టీ కన్నా వ్యక్తిగత ప్రచారమే ఎక్కువ అయిందని ఆరోపించారు. పోరాడి సాధించుకున్న తెలంగాణపై మాట్లాడే అర్హత కాంగ్రెస్‌కు లేదన్నారు. ఆనాడు కాంగ్రెస్ తెలంగాణను ఇచ్చింది ప్రేమతో కాదని, భయంతో అని అన్నారు. సొంత పార్టీ ఎమ్మెల్యేలే రేవంత్ పేరు మరిచి పోతున్నారని ఎద్దేవా చేశారు. ఒక్క మంచి పని చేయని సీఎం రేవంత్‌రెడ్డిని ప్రజలెందుకు గుర్తు పెట్టుకుంటారని ప్రశ్నించారు. రేవంత్ వల్ల బాధించబడిన వారే ఆయనను ఓడించేందుకు గుర్తు పెట్టుకుంటారన్నారు. కేసీఆర్ దీక్ష సమయంలో విద్యార్థుల బలిదానాలకు కాంగ్రెస్ కారణం కాదా అని ప్రశ్నించారు. అందుకే ముమ్మాటికీ తెలంగాణకు మెయిన్ విలన్ కాంగ్రెస్సే అన్నారు. బీఆర్ఎస్ రజతోత్సవ సభలో కెసిఆర్ మాటలను ప్రజలంతా స్వాగతించారని తెలిపారు. అధికారం కోసం దిగజారే నైజం రేవంత్ రెడ్డిదని విమర్శించారు. పదేళ్లు మాదే అధికారమన్న వాళ్లకి కెసిఆర్ ఫాంహౌస్‌లో ఉంటే భయమెందుకని ప్రశ్నించారు. కెసిఆర్‌పై చిల్లర మాటలు మాని హామీల అమలుపై దృష్టి పెట్టాలని కోరారు.

మీడియాతో మాట్లాడుతున్న జగదీశ్‌రెడ్డి

సమత మానవత పునాదిగా మహా కవి శ్రీశ్రీ కవిత్వం

ప్రజాశక్తి కల్చరల్

సామ్య వాద భావనలతో అభ్యుదయ ఆలోచనలతో నిండిన మహా కవి శ్రీ శ్రీ మహా ప్రస్థానం ప్రపంచ సాహిత్య చరిత్రలో నే అత్యుత్తమ చైతన్య మహా కావ్యం అని శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు ఆచార్య కొలకలూరి ఇనాక్ అన్నారు సమత మానవత పునాది శ్రీ శ్రీ కవిత అని చెప్పారు.త్యాగరాయ గానసభ లోని కళా సుబ్బారావు కళా వేదిక పై గానసభ నిర్వహణలో జరుగుతున్న ఎందరో మహానుభావులు కార్యక్రమ పరంపర లో భాగంగా మహా కవి శ్రీ శ్రీ జయంతి యాదిలో సంస్మరణ సమావేశం జరిగింది ముఖ్య అతిథిగా ఆచార్య కొలకలూరి ఇనాక్ పాల్గొని మాట్లాడుతూ శ్రీ శ్రీ విప్లవ సాహిత్య యుగ కర్త అన్నారు అయన కవిత్వం చదివి సమాజ అసమానతలు పై ఉద్యమించిన వారు కొందరు ఐతే ఎందరో అయన పంథాను అందిపుచ్చుకొని కవితా రచన చేపట్టారు అని వివ రించారు సినీ పాటల రచయిత గానూ శ్రీశ్రీ అవకాశం వున్న సందర్భాలలో సామ్యవాద భావాల నే పాటలలో నింపారు అని చెప్పారు తెలుగు వీర లేవరా అనే పాట ఉత్తమ గీతం గా కేంద్ర ప్రభుత్వం అవార్డ్ పొందడం విశేషం అని చెప్పారు గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధన మూర్తి అధ్యక్షత వహించిన సభలో గాయకుడు శ్రీధర సుబ్రహ్మణ్యం గాన సభ పాలక వర్గ సభ్యురాలు గుండవరపు గీత తదితరులు పాల్గొన్నారు